
సాక్షి
కాకినాడ

మంగళవారం । 27 । జూన్ । 2023



అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు బొడ్డపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి దంపతులు (హైదరాబాద్) సోమవారం రూ.10,120 విరాళాన్ని ఈఓకు అందజేశారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 1,590, మధ్య డెల్టాకు 1,140, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0°/24.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	32.5	24.0
కాకినాడ	33.0	24.5
అమలాపురం	32.0	26.0

న్యూస్‌రీల్

సమస్యలను వెంటనే పరిష్కరించండి

కాకినాడ సిటీ: డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకూ డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 19 మంది విద్య, ఉపాధి, భూ సర్వే, డ్రైనేజీ, సీసీ రోడ్లు వంటి సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్ 18004253077కు ఫోన్ చేసి తెలియజేశారు. ఈ సందర్భంగా కృతికా శుక్లా మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహిస్తున్నామన్నారు. 19 సమస్యలను పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు పంపించామన్నారు. డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ జీఎస్ఎస్ శ్రీనివాస్, వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా 'స్పందన'కు 501 అర్జీలు

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం– స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జిల్లా స్థాయి స్పందన జరిగింది. జేసీ ఎస్.ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జి జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, డీఎం సివిల్ సప్లయిస్ డి.పుష్పమణి, ఎస్సీ కార్పొరేషన్ల ఈడీ డీఎస్ సునీతలతో కలసి కలెక్టర్ కృతికా శుక్లా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రభుత్వ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 501 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారుల సంతృప్తి స్థాయిని పెంచే విధంగా అధికారులు ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారదర్శకంగా భూసర్వే

రాజానగరం: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా రీసర్వే పారదర్శకంగా జరుగుతోందని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా నిర్వహించేందుకు గాను రెవెన్యూ అధికారులకు, సర్వే అండ్ ల్యాండ్, సచివాలయ సిబ్బందికి స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల ఆడిటోరియంలో సోమవారం రెండో విడత శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ప్రక్రియను సమీక్షిస్తూ, మరింత సమర్థంగా రీసర్వే నిర్వహించేందుకు ఈ శిక్షణ తోడ్పడుతుందన్నారు. తొలివిడత శిక్షణ నవంబరు 30న ఇదే ఆడిటోరియంలో జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ, క్షేత్రస్థాయిలో ఎదురైన సమస్యలు, అనుభవాలను క్రోడీకరించి, రీసర్వే కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. భూమికి సంబంధించిన డిజిటల్ రికార్డులను నిల్వ చేయడానికి సమగ్ర రీసర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. దీనివల్ల భవిష్యత్తులో భూరికార్డులను తారుమారు చేసేందుకు ఎవరికీ అవకాశం ఉండదన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను ప్రతి ఒక్కరు నిబద్ధతతో చేపట్టాలన్నారు.

రంగు మారి.. ధర చేజారి..





- ఆశాజనకంగా మామిడి దిగుబడులు
- సీజను ముగింపు దశలో మారిన రంగు
- ఫలితంగా పడిపోయిన అమ్మకాలు
- జిల్లాలో డీలా పడిన మామిడి రైతులు

తుని: వేసవి వచ్చిందంటే చాలు వయసుతో సంబంధం లేకుండా చిన్నా పెద్దా అందరూ ఎంతో ఇష్టంగా తినే మధుర ఫలాలు మామిడి పండ్లు. అందుకు అనుగుణంగానే ఈ ఏడాది ఎక్కడ చూసినా మామిడి పండ్లే కనిపించాయి. విక్రయాలు కూడా విరివిగానే జరిగాయి. అయినా రైతుకు మాత్రం సంతోషం మిగలలేదు. దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో ప్రారంభంలో లాభాలు వస్తాయని వీరు ఆశించారు. అందుకు భిన్నంగా కాయ రంగు మారడం, కాయపుచ్చు తెగులు ఆశించడం వీరి ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. ఫలితంగా సీజన్ చివరలో నష్టాలను చవిచూడాల్సి వచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇబ్బందులు పడుతూనే పండ్లను మార్కెట్‌కు తెస్తే అక్కడ కొనే నాథుడే కరువయ్యాడని తుని రూరల్ మండలానికి చెందిన రైతులు చెప్పారు. సీజన్ ప్రారంభంలో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. టన్నుకు రూ.65 వేల వరకూ ధర లభించింది. ప్రస్తుతం టన్ను ధర రూ.10 వేలకు పడిపోయింది. ఇందుకు ప్రధాన కారణం కాయల్లో నాణ్యత లేక పోవడం, ఎగుమతులు నిలిచి పోవడం.

15,362 హెక్టార్లలో సాగు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 15,362 హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. తుని సబ్ డివిజన్‌లో 3458 హెక్టార్లలో రైతులు మామిడి సాగు చేశారు. బంగినపల్లి, చెరకు రసాలు, తోతాపురి, సువర్ణ రేఖ, పంచదార కంచి, కొత్తపల్లి కొబ్బరి, పందూరి మామిడి తదితర రకాల పండ్లు మూడు నెలల పాటు జోరుగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు జరిగాయి. ఉద్యానశాఖ గణాంకాల ప్రకారం 23,130 మెట్రిక్ టన్నులు ఎగుమతి చేశారు. తద్వారా రూ.50 కోట్లు వ్యాపారం జరిగింది. ప్రస్తుతం మామిడి తోటల్లో 6 వేల టన్నుల మేర దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

రంగు మారడంతో..

మెట్ట ప్రాంతంలో పండిన మధుర ఫలాల రంగు మారింది. వడగండ్ల వాన, మంచు ప్రభావంతో చెట్టు కొమ్మలకు ఉన్న కాయలు నలుపు రంగులోకి మారాయి. దీంతోపాటు కాయపుచ్చు తెగులు సోకడంతో పురుగులు పట్టాయి. ప్రస్తుతం మేలు రకాలైన బంగినపల్లి, చెరకు రసాలు, పంచదార కంచి, తోతాపురి, దేశవాళీ రకాలు మార్కెట్‌లోకి విరివిగా వస్తున్నాయి. సీజన్ ప్రారంభంలో హాట్ కేక్‌లా అమ్ముడైన మధుర ఫలాలను ప్రస్తుతం కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. మార్కెట్‌లో రైతులు గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తుంది.

మామిడి ఎగుమతులు (మెట్రిక్ టన్నుల్లో)

నెల	2022	2023
మార్చి	5750	7250
ఏప్రిల్	10,150	12,450
మే	2788	3430
మొత్తం	18,698	23,130



రంగు మారిన మామిడి పండ్లు

చివర్లో ధర పతనం



నాలుగు ఎకరాల్లో మామిడి సాగు చేశాం. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మంచి ధర లభించింది. మూడు టన్నులు వ్యాపారులకు అమ్మాను. సీజన్ చివర్లో మంచి ధర వస్తుందని కోయలేదు. ప్రస్తుతం కోసి మార్కెట్‌కు తెస్తే తక్కువ ధరకు అడుగుతున్నారు. చేసేది లేక పోగులు పెట్టి అమ్ముతున్నాను.

– జి.రమణ, రైతు, తుని

రంగు మారింది



మామిడి పండ్లకు రంగు చాలా అవసరం. కాయ పరిమాణంతో పాటు సువాసన ఉంటే ప్రజలు ఇష్టపడతారు. సీజన్ ప్రారంభంలో రంగు బాగుంది. మంచి ధర లభించింది. బంగినపల్లి టన్ను ధర రూ.65 వేలు పలికింది. ఇతర రాష్ట్రాలకు 23,130 మెట్రిక్ టన్నులు ఎగుమతి జరిగింది. ప్రస్తుతం మధుర ఫలాల రంగు మారడంతో ధర పతనమైంది. వాతావరణం అనుకూలించక తెగుళ్లు వ్యాపించాయి. వచ్చే నెల 15 వరకూ మామిడి పండ్లు అందుబాటులో ఉంటాయి.

– విజయ లక్ష్మి, ఉద్యానశాఖ అధికారి, తుని



తుని మార్కెట్‌లో మామిడి పండ్లు విక్రయించేందుకు ఎదురు చూస్తున్న రైతులు



ధర తగ్గడంతో అమ్మకానికి పోగులు పెట్టిన దృశ్యం

పటిష్టంగా జగనన్న సురక్ష అమలు

కాకినాడ సిటీ: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జగనన్న సురక్ష, ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణ పనుల పురోగతి ఇతర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై 1న జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు ప్రారంభమవుతాయన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిల నిర్వహించే క్యాంపులు సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సేవల వివరాలను సేకరించి వెంటనే టోకెన్ నంబర్ జారీ చేయాలని సూచించారు. క్యాంపు నిర్వహణ రోజు ప్రజలకు జననం, మరణం, వివాహం, కులం, ఆదాయం, కౌలు రైతు ఇతర ధ్రువీకరణ పత్రాలను అందజేసేందుకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ శాశ్వత భవనాలైన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ క్లినిక్ భవన నిర్మాణ పనులకు సంబంధించి వారం, వారం స్టేజ్ కన్వర్షన్ జరిగేలా కృషి చేయాలన్నారు. రూఫ్ లెవెల్ వరకు పనులు పూర్తయిన భవనాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవోఏ రమణారెడ్డి, సీపీవో పి త్రినాథ్, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, మెప్మా పీడీ బి ప్రియంవద, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం శ్రీనివాస్, కాకినాడ, పెద్దాపురం డీఎల్‌డీవోలు నారాయణమూర్తి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెంటాథలాన్ పోటీలలో కాకినాడ క్రీడాకారుల ప్రతిభ



రజత పతకాలు సాధించిన దీప్తి సునయన

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా క్రీడామైదానంలో ఈనెల 23, 24 తేదీలలో నిర్వహించిన మోడరన్ పెంటాథలాన్ పోటీల్లో కాకినాడ క్రీడాకారులు ప్రతిభను కనబరచి పలు విభాగాల్లో పతకాలు సాధించారు. పీఎస్ఆర్ఎస్ దీప్తి సునయన బేథేల్, ట్రైథేల్ అంశాల్లో రతజ పతకాలు సాధించింది. మందా సాయిచరణ్ అండర్ –9 విభాగంలో బైథలాన్‌లో రజత పతకం కైవశం చేసుకున్నాడు. ఆలమూరు అభిషై అండర్–13 విభాగంలో బైథలాన్, ట్రైథలాన్‌లో కాంస్య పతకాలు అందుకున్నాడు. పతకాలు సాధించిన క్రీడాకారులను మోడ్రన్ పెంటాథలాన్ రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరరావు, డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్, పెంటాథలాన్ సంఘ నిర్వహణాకార్యదర్శి కృష్ణ సోమవారం అభినందించారు.

సోమేశ్వరుడి సేవలో జస్టిస్ వెంకటరమణ

నిడదవోలు : నిడదవోలులోని శ్రీ బాలా త్రిపుర సుందరి శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ఆయనకు ఆలయ ఈవోట సోమాల శివ ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకుళపు లక్ష్మీనరసింహశాస్త్రితో పాటు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ విజయ కృష్ణఫణీంద్ర పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల ఉచ్చులో పడొద్దు



డ్రగ్స్ కిల్ యువర్ డ్రీమ్స్ క్యాంపెయిన్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ కృతికా శుక్లా

కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: మాదక ద్రవ్యాల ఉచ్చులో పడి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ది షైన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన డ్రగ్స్ కిల్ యువర్ డ్రీమ్స్ క్యాంపెయిన్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా ఆవిష్కరించారు. ది షైన్ టీం ప్రత్యేక క్యాంపెయిన్ ద్వారా విద్యాలయాల్లో సెమినార్లు నిర్వహించి విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు పూనుకోవడం అభినందనీయమని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు తమ సంస్థ కృషి చేస్తోందని సంస్థ నిర్వాహకుడు సాయిప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగానే ఈ క్యాంపెయిన్ ద్వారా విద్యాలయాల్లో ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. అవసరమైతే విద్యార్థులకు వ్యక్తిగత కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వజహత్, ధృవీణ, స్వాతి, అనిత, దీప్తి, ప్రియాంక, రుఖియ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు నిబంధనలు

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ ప్రమాదాల నివారణకు వినియోగదారులు విధిగా నిబంధనలు పాటించి, ఏపీఈపీడీసీఎల్‌కు సహకరించాలని పర్యవేక్షక ఇంజినీర్ టీవీఎస్ఎన్ మూర్తి పిలుపు నిచ్చారు. భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని రాజమహేంద్రవరం త్యాగరాజ నారాయణదాస సేవాసమితి కల్యాణ మండపంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మూర్తి మాట్లాడుతూ జూలై రెండో తేదీ వరకూ జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ కార్యాలయాలు, సబ్ స్టేషన్లు, సబ్ డివిజన్, డివిజన్ కార్యాలయాల వద్ద అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. విద్యుత్ కార్యాలయంలో సిబ్బంది, పంచాయతీ విద్యుత్ కార్మికులు, ప్రైవేట్ విద్యుత్ కార్మికులు, కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ సిబ్బంది, మైకుసెట్ సౌండ్ సిస్టమ్ కార్మికులు, విద్యుత్ అలంకరణ, మండపాల అలంకరణ, లైటింగ్, డెకరేషన్ సిబ్బంది, కొబ్బరి, పామాయిల్ రైతులు, దింపు కార్మికులు, బిల్డింగ్ కార్మికులకు పలు సూచనలు అందజేస్తామన్నారు.



మాట్లాడుతున్న పర్యవేక్షక ఇంజనీర్ టీవీఎస్ఎన్ మూర్తి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులందరూ వారం రోజుల పాటు గ్రామ, వార్డు సచివాలయాలు, కాలేజీలు, స్కూళ్లు, ముఖ్యమైన కూడళ్లు, ఇతర కార్యాలయాల్లో సదస్సు నిర్వహించాలని పిలుపు నిచ్చారు. విద్యుత్ వినియోగదారులు సమస్యలపై 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈలు నక్కపల్లి శామ్యూల్, దాట్ల శ్రీధర్ వర్మ, డీఈలు దేవయ్య, గాబ్రి యేల్, నటరాజన్, చిట్టిరాజు పాల్గొన్నారు.

వృత్తిలో నిలదొక్కుకునే'లా' ఆర్థిక సాయం

- వైఎస్సార్ లా నేస్తం పథకం స్టైఫండ్ జమ
- జిల్లాలో 198 మందికి రూ.49.50 లక్షల లబ్ధి

కాకినాడ సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రారంభించిన వైఎస్సార్ లా నేస్తం పథకం యువ న్యాయవాదులకు తోడుగా నిలుస్తోందని ఎంపీ వంగా గీత అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ లా నేస్తం పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ బార్ అసోసియేషన్ నుంచి ఎం విశ్వేశ్వరరావు, జిల్లాలోని వివిధ ప్రాంతాల యువ న్యాయవాదులు వర్చువల్‌గా హాజరయ్యారు. జూనియర్ న్యాయవాదులకు మెగా చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమానికి ప్రణాళికాయుతంగా కృషి చేస్తున్నారన్నారు. వృత్తిపరంగా యువ నాయ్యవాదులు నిలదొక్కుకునేందుకు తొలి మూడేళ్లు వైఎస్సార్ లా నేస్తం పథకం అండగా నిలుస్తుందన్నారు.

198 మందికి రూ. 49.50 లక్షల లబ్ధి: కలెక్టర్ కృతికా శుక్లా



యువ న్యాయవాదులకు మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా

జిల్లాలో వైఎస్సార్ లా నేస్తం పథకం ద్వారా ఈ ఏడాది మొదటి విడతలో 198 మంది జూనియర్ న్యాయవాదులకు రూ.49.50 లక్షల మేర లబ్ధి చేకూరినట్లు కలెక్టర్ కృతికా శుక్లా వెల్లడించారు. అర్హులైన జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5 వేలు స్టైఫండ్ చొప్పున ఫిబ్రవరి–జూన్ వరకు రూ.25 వేలు తొలివిడతలో అందినట్లు వివరించారు. కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువ లాయర్లకు ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందుతోందన్నారు. యువ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకునేలా మూడేళ్ల పాటు ఏడాదికి రూ. 60 వేలు చొప్పున మొత్తం రూ.1.80 లక్షలు స్టైఫండ్ అందుతుందన్నారు. సాంఘిక సంక్షేమశాఖాధికారి డీవీ రమణమూర్తి, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్సార్ లా నేస్తం పథకం అమలు చేస్తున్నారు. ఇందుకు మా యువ న్యాయవాదులు తరఫున ఆయనకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.100 కోట్లతో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌ను కూడా ఏర్పాటు చేశారు. గౌరవప్రదమైన వృత్తిలో ఉన్న లాయర్ల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారు.

ఎంఎస్‌కేరావు, కత్తిపూడి, శంఖవరం మండలం.

కెరీర్ ప్రారంభంలో ఆసరా



లా గ్యాడ్యుయేషన్ పూర్తయ్యాక కెరీర్‌లో స్థిరపడేందుకు కొంత సమయం పడుతుంది. వృత్తిలో నిలదొక్కుకునేందుకు వైఎస్సార్ లా నేస్తం పథకం ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం మాలాంటి యువ న్యాయవాదులకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రారంభంలో ఎదురయ్యే ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కిస్తుంది. ఇంత మంచి పథకాన్ని అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

కె సూర్యప్రభ, ఎర్రంపాలెం, గండేపల్లి మండలం.

కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్

కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న కార్యదర్శులకు సోమవారం బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. అంతర జిల్లాల బదిలీలు, ఇతర జిల్లాల నుంచి తూర్పుగోదావరి జిల్లాలో బదిలీ కోరుకున్న కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అందుబాటులో ఉన్న ఖాళీలను బట్టి బదిలీలను ఖరారు చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, రాజమహేంద్రవరం రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ జీవీఎస్ఎన్ మూర్తి, వివిధ పురపాలక సంఘాల కమిషనర్‌లు జె.సురేంద్ర, పి.కృష్ణవేణి, పి.రామ్‌కుమార్, కె.శ్రీకాంత్‌రెడ్డి, బీజేఎస్ రాజు, వీఎల్ నాయుడు, జి.లోవరాజు తదితరులు పర్యవేక్షించారు. సుమారు 97 మంది కార్యదర్శులకు బదిలీల కోసం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు నగరపాలక సంస్థ అధికారులు చెప్పారు.




బదిలీల కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

బుక్.. అదుర్స్



ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ముద్రించిన పాఠ్యాంశాలు



ఆకట్టుకునేలా ఉన్న పాఠ్య పుస్తకాలు

- నాణ్యమైన రంగులు, హంగులతో పుస్తకాల ముద్రణ
- సర్కారీ పాఠశాలల విద్యార్థుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం
- 31.73 లక్షల సెమిస్టర్-1 పాఠ్య పుస్తకాల పంపిణీ

రాయవరం: బడి గంట గణగణమంటూ మోగింది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో రెండు పూటలా పని చేస్తున్నాయి. విద్యా సంవత్సరం తొలి రోజునే నూతన పాఠ్య పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేశారు. నాణ్యమైన కాగితం, అయిల్ ప్రింట్‌తో ఈసారి పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాల ముద్రణ ఎంతో ఆకట్టుకుంటోంది.

కొత్తకొత్తగా..

పాఠశాలల్లో మన బడి నాడు–నేడు, జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, 3–10 తరగతుల విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లతో బోధన, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ, ఇంగ్లిషు మాధ్యమంలో బోధన, డిజిటల్ చదువులు.. ఇలా పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారు. వీటితో పాటు నూతన పాఠ్య పుస్తకాలను కొత్త హంగులతో, నాణ్యతతో తయారు చేసి, విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆకట్టుకునే చిత్రాలు, అందమైన కవర్ పేజీలతో రూపొందించిన ఈ పుస్తకాలను విద్యార్థులు మురిపెంగా చూసుకుంటూ మురిసిపోతున్నారు. వారిలో నూతనోత్సాహం కనిపిస్తోంది.

పుస్తకాలకు కోడింగ్ నంబర్లు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీని పాఠశాల విద్యాశాఖ ఈ ఏడాది పకడ్బందీగా చేపట్టింది. సబ్జెక్టుల వారీగా, సెమిస్టర్ల వారీగా పుస్తకాలను అందజేశారు. పుస్తకాలు దుర్వినియోగం కాకుండా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పంపిణీ చేశారు.

చిత్రాలు, రంగులతో కొత్తరూపు

ప్రభుత్వం పంపిణీ చేసిన పుస్తకాల ముద్రణ, నాణ్యత నభూతో.. అన్న రీతిలో ఉన్నాయి. చూడగానే విద్యార్థులను ఆకట్టుకునేలా చిత్రాలు, టేబుల్స్, రంగులతో నిండి ఉన్నాయి. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు పెద్ద పెద్ద బొమ్మలను విభిన్న రంగుల్లో ఆకట్టుకునేలా వేసి, నాణ్యమైన కాగితాలపై ముద్రించారు. కవర్ పేజీతో పాటుగా లోపలి పేజీలు కూడా పాఠ్యాంశాల వారీగా అందంగా కనిపిస్తున్నాయి. పెద్ద తరగతుల వారికి కూడా ఆయా సబ్జెక్టు పుస్తకాల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన వీడియో వివరణలను అందుబాటులో ఉంచారు. పుస్తకంలో ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్ ద్వారా స్కాన్ చేసిన వెంటనే సంబంధిత విషయానికి సంబంధించిన అదనపు సమాచారంతో కూడిన వీడియోలు అందుబాటులోకి వచ్చేలా విద్యా శాఖ ఏర్పాట్లు చేసింది. దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం కొత్త పాఠ్య పుస్తకాలపై ఎక్కడ లేని ఆసక్తి చూపుతున్నారు.

జిల్లాల వారీగా సెమిస్టర్-1 పాఠ్య పుస్తకాల పంపిణీ ఇలా..

జిల్లా	పాఠ్య పుస్తకాలు	వర్క్ బుక్స్	మొత్తం	పంపిణీ	శాతం
తూర్పు గోదావరి	5,63,607	1,15,176	6,78,783	6,78,783	100
కాకినాడ	12,10,436	2,47,163	14,57,599	14,57,599	100
కోనసీమ	8,53,289	1,83,677	10,36,966	10,36,966	100

తరగతుల వారీగా పాఠ్య పుస్తకాల టైటిల్స్

తరగతులు	టైటిల్స్
1, 2	8
3, 4, 5	12
6, 7	11
8	14
9	17
10	08

తల్లిదండ్రులపై భారం తగ్గించేందుకు..

విద్యార్థుల తల్లిదండ్రులపై భారం తగ్గించేందుకు ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను సెమిస్టర్ల వారీగా ముద్రించింది. గత ఏడాది మూడేసి సెమిస్టర్లుగా ముద్రించగా, ఈ ఏడాది రెండు సెమిస్టర్లకు కుదించారు. దీనివలన టైటిల్స్ సంఖ్య కూడా తగ్గింది. ప్రస్తుతం 1–10 తరగతులకు లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ కలిపి 113 టైటిల్స్ ముద్రించారు. తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 26,27,332 పాఠ్య పుస్తకాలు, 5,46,016 వర్క్‌బుక్స్ కలిపి మొత్తం 31,73,348 పుస్తకాలను సెమిస్టర్-1లో పంపిణీ చేశారు. సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలను కూడా జూలై నెలలో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టింది.

చూడచక్కగా..




ఈ ఏడాది పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్‌ను నూరు శాతం పాఠశాలలకు సకాలంలో చేరవేశాం. పాఠ్య పుస్తకాలు విద్యార్థులను ఆకట్టుకునేలా, నాణ్యమైన పేపరుతో ముద్రించారు. అక్షరాలు స్పష్టంగా, అర్థమయ్యేలా ఉన్నాయి. చూడచక్కగా ఉన్న పాఠ్య పుస్తకాలు విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

క్లుప్తంగా

ఎలక్ట్రికల్ షాపులో అగ్ని ప్రమాదం

రూ.40 లక్షల నష్టం



షాపులో పూర్తిగా దగ్ధమైన సామగ్రి

నిడదవోలు: పట్టణంలో ఓ ఎలక్ట్రికల్ షాపు దగ్ధమైన ఘటనలో రూ.40 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. స్థానిక గణేష్ చౌక్ సెంటర్‌లో గోదావరి ఎలక్ట్రికల్ షాపును గాంచి శంకర్‌లాల్ నిర్వహిస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం అర్ధరాత్రి షాపులో మంటలు చెలరేగాయి. షాపు పూర్తిగా దగ్ధమైంది. అందులోని ఎలక్ట్రికల్ సామగ్రితో పాటు ఫర్నిచర్, ప్లంబింగ్ సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. నిడదవోలు అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు తన సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కొత్తపల్లి: విద్యుదాఘాతంతో సోమవారం ఒక వ్యక్తి మృతి చెందాడు. ఇన్‌చార్జి ఎస్సై సత్యనారాయణ కథనం ప్రకారం.. కొండెవరం గ్రామానికి చెందిన రాయుడు చంద్రరావు (43) చింత చెట్టు సెంటర్‌లో టీ కొట్టు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం వ్యాపారం నిర్వహిస్తున్న సమయంలో మోటారు నుంచి నీరు రాలేదు. దీంతో ఏమైందో చూడటానికి మోటార్‌ను తాకడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని బంధువులు పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడు చంద్రరావుకు భార్య నాగలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి గోవిందరావు మృతి



రెడ్డి గోవిందరావు (ఫైల్)

కాకినాడ/ఆలమూరు: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) మాజీ చైర్మన్ రెడ్డి గోవిందరావు (83) సోమవారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అస్వస్థతతో ఉన్న ఆయన ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరుకు చెందిన ఆయన 1995 నుంచి 2004 వరకూ రెండు పర్యాయాలు డీసీఎంఎస్ చైర్మన్‌గా సేవలందించారు. గుమ్మిలేరు సర్పంచ్‌గా, జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షునిగా కూడా అనేక పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో కొనసాగుతున్నారు. గుమ్మిలేరు పరిసర ప్రాంతాల్లో పేద వర్గాల అభ్యున్నతికి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. కాకినాడలోని హిందూ శ్మశానవాటికలో గోవిందరావు అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతికి పలువురు రాజకీయ, నగర ప్రముఖులు తీవ్ర సంతాపం తెలిపారు. గోవిందరావు మృతితో గుమ్మిలేరులో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఎంపీ గీత సంతాపం

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గోవిందరావు మృతి పట్ల కాకినాడ ఎంపీ వంగా గీత ప్రగాఢ సంతాపం తెలిపారు. కాకినాడలోని ఆయన కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలిపి, ఓదార్చారు. తాను జెడ్పీ చైర్మన్‌గా ఉన్న సమయంలో రెడ్డి గోవిందరావుతో కలిసి పని చేశానని, ఆయన సామాజిక దృక్పథం కలిగిన సమర్థవంతుడైన నాయకుడని అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్‌గా సుదీర్ఘ కాలం పని చేసిన ఆయన అనేక గోడౌన్ల నిర్మాణంతో పాటు అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారని గుర్తు చేసుకున్నారు.

కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య

సీతానగరం: కడుపు నొప్పి తాళలేక ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై సమర్పణరావు కథనం ప్రకారం.. పురుషోత్తపట్నానికి చెందిన మాసిన రామకృష్ణ (70) రెండేళ్ల నుంచి అనారోగ్యంతో బాధ పడుతూ మందులు వాడుతున్నాడు. రాత్రి వేళల్లో నిద్ర పట్టక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో రామకృష్ణకు సోమవారం ఉదయం కడుపు నొప్పి రావడంతో తట్టుకోలేకపోయాడు. వైద్యుని వద్దకు తీసుకువెళ్తానని కుమారుడు రాజశేఖర్ చెప్పినా తిరస్కరించి, పొలంలోకి వెళ్తానని చెప్పాడు. అనంతరం పొలం వద్ద ఉన్న పశువుల షెడ్డులో దూలానికి తాడుతో ఉరి వేసుకుని రామకృష్ణ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు చిట్టిబాబు, రాజశేఖర్ ఉన్నారు. రాజశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు


కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సొంత పెద్దమ్మను హత్య చేసిన సంఘటనలో నిందితుడు దేవాదుల నాగేశ్వరరావుకు జీవిత ఖైదు విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి జి.సునీత సోమవారం తీర్పు ఇచ్చారు. వివరాలివీ.. ప్రకాశ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాలాచెరువు స్పిన్నింగ్ మిల్లు కాలనీలో దేవాదుల శ్యామల ఒంటరిగా నివాసం ఉండేది. ఇన్నీసుపేటకు చెందిన దేవాదుల నాగేశ్వరరావుకు ఆమె పెద్దమ్మ అవుతుంది. అతడు ఏ పనీ చేయకుండా మద్యం తాగుతూ, తిరుగుతూండేవాడు. నాగేశ్వరరావు 2018 నవంబర్ 14న పెద్దమ్మ శ్యామల ఇంటికి వెళ్లాడు. ఆమె టీ కాచేందుకు వెళ్లగా, అదే సమయంలో రొట్టెల కర్రతో తలపై బాది, పీక నొక్కి హత్య చేశాడు. ఆమె చేతులకున్న 10 గ్రాముల బంగారు గాజులు, నాంతాడు, నల్లపూసల గొలుసు, బంగారు పగడాల గొలుసు కలిపి మొత్తం 33 కాసుల బంగారం దొంగిలించి పారిపోయాడు. దీనిపై హతురాలి కుమారుడు వెంకట రంగాకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి సీఐ ఎస్కే బాజీలాల్ కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్‌వీ ధర్మారావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు. సాక్షులను కోర్టుకు హాజరు పరచి, నేర నిరూపణకు సీఐ పీఈ పవన్‌కుమార్‌రెడ్డి, కోర్టు హెడ్ కానిస్టేబుల్ పి.కొండలరావు కృషి చేశారు. విచారణలో నాగేశ్వరరావుపై నేరం రుజువైంది.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కాకినాడ రూరల్: పోర్టు రోడ్డులో లారీ ఢీకొని కరప మండలం గురజనాపల్లికి చెందిన ఆకుల సునీల్‌కుమార్ (38) మృతి చెందాడు. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ పోర్టు నుంచి సూర్యారావుపేట లైట్ హౌస్ వైపు ఆదివారం రాత్రి అతి వేగంగా వెళ్తున్న లారీ కోరమండల్ జంక్షన్ వద్ద మోటార్ సైకిల్‌పై వెళ్తున్న సునీల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన సునీల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్న అతడు కోరమండల్‌లోకి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడికి భార్య, మూడేళ్ల కుమార్తె ఉన్నారు.

విద్యుత్ శంఖుచక్ర నామాలకు టెండర్ ఖరారు!

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేయతలపెట్టిన శంఖుచక్ర నామాలకు టెండర్ దాదాపుగా ఖరారైంది. వీటిని న్యూ సీసీ సత్రం మీద ఏర్పాటు చేసేందుకు రూ.34.78 లక్షల అంచనాతో ఈ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా పిలిచిన టెండర్లను సోమవారం తెరిచారు. మొత్తం రెండు టెండర్లు దాఖలయ్యాయి. వీటిలో శ్రీ శ్రావణి ఇండస్ట్రీస్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సంస్థ 5 శాతం ఎక్కువగా రూ.36.52 లక్షలకు, విజయం ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ 18.77 శాతం తక్కువగా రూ.28.25 లక్షలకు టెండర్లు దాఖలు చేశాయి. తక్కువగా ఉన్న విజయం ఇన్‌ఫ్రా టెండర్‌ను ఆమోదించాలని కోరుతూ దేవదాయ శాఖ కమిషనర్‌కు ఫైలు పంపించామని అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ సోమవారం విలేకర్లకు తెలిపారు. దేవస్థానంలోని న్యూ సీసీ సత్రంలో ఇప్పటికే 42 అడుగుల ఎత్తున విద్యుత్ నామం భక్తులను అలరిస్తోంది. అయితే ఒకే ఎత్తులో శంఖుచక్ర నామాలను ఇనుప గొట్టాలతో తయారు చేసి, వాటికి రేకులు అమర్చే పనికి టెండర్ పిలిచారు. వీటి ఏర్పాటుకు మరో రూ.36 లక్షలు ఖర్చవుతుందని ఈఓ తెలిపారు. జాతీయ రహదారి పైన, రైళ్లలోను ప్రయాణించే వారికి కూడా ఈ శంఖుచక్ర నామాలు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తాజా అంచనాల ప్రకారం శంఖుచక్ర నామాలు 48 అడుగుల ఎత్తున ఉంటాయన్నారు. ఉప ముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు వీటిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రెండు నెలల్లో వీటిని ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని ఈఓ చెప్పారు.



రత్నగిరిపై ఏర్పాటు చేయనున్న విద్యుత్ శంఖుచక్ర నామాల నమూనా

పాఠశాలకు రూ.2.20 లక్షల విరాళం

పి.గన్నవరం: స్థానిక శింగంశెట్టి ప్రభావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు సోమవారం రూ.2.2౦ లక్షల విరాళం అందజేశారు. ఈ సొమ్మును డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీతో ఏటా పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించాలని ప్రధానోపాధ్యాయుడు డీఎస్‌వీ ప్రసాద్‌ను వారు కోరారు. విరాళం అందించిన 1983–84 బ్యాచ్ విద్యార్థులు మానేపల్లి వెంకటేశ్వరరావు, చింతపల్లి సుజాత (జీహెచ్‌ఎం), పాకా వలంటీనా, యర్రంశెట్టి సూరిబాబు, అడబాల అలివేలు, ఒరిగొండ పద్మావతి, అయ్యగారి కమల తదితరులను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు, హెచ్‌ఎం ప్రసాద్ అభినందించారు.

పది రోజుల్లో పూర్తి స్థాయి కమిటీలు

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేత జక్కంపూడి గణేష్
- త్వరలో 'జయహో జగనన్న' సమావేశాలు

రాజమహేంద్రవరం సిటీ: యువజన విభాగాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన కమిటీలను పది రోజుల్లో నియమిస్తామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ తెలిపారు. రీజియన్ పరిధిలోని యువజన విభాగం పార్లమెంటరీ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులతో రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో జిల్లా, మండల యువజన విభాగం కమిటీలపై ఆయన సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కమిటీల నియామకం అనంతరం యువజన విభాగం ఆధ్వర్యాన త్వరలో 'జయహో జగనన్న' పేరుతో ప్రతి జిల్లాలో సమావేశాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. యువజన విభాగం ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు, పశ్చిమ గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల యువజన విభాగం అధ్యక్షులు చొటుపల్లి వీరన్న, కుంచలాపల్లి విన్‌స్టన్‌బాబు, సూరిశెట్టి బాబి, పడమటి గిరిబాబు, ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి కందుల దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి గణేష్

సీపెట్ డిప్లమో కోర్సుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: విజయవాడలోని భారత ప్రభుత్వ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ – టెక్నాలజీ(సీఐపీఈటీ – సీపెట్)లో డిప్లమో కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సీపెట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చింతా శేఖర్ సోమవారం ఈ విషయం తెలిపారు. మూడు, రెండు సంవత్సరాల వ్యవధితో డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సులకు 10వ తరగతి చదివిన వారు అర్హులని వివరించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ– పీపీటీ) కోర్సుకు బీఎస్సీ చదివి ఉండాలని తెలిపారు. అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం, విద్యార్థినీ విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ సదుపాయం ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే నిర్వహించిన సీపెట్ కామన్ అడ్మిషన్ టెస్ట్ ఫలితాలు వెలువడినప్పటికీ, ఏపీ 10వ తరగతి సప్లిమెంటరీ విద్యార్థుల విజ్ఞప్తి మేరకు వారికి రెండో విడత ప్రవేశ పరీక్ష నిర్వహించి, బీఎస్సీ అభ్యర్థులకు తుది అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు బి.అంజినాయక్‌ను 78935 86494, కొల్లు రమణ ఫౌండేషన్ ఆర్గనైజర్ కొల్లు ఆనంద్‌ను 99488 77339 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శేఖర్ సూచించారు.

వివాహిత ఆత్మహత్య

ముమ్మిడివరం: భర్తతో తగవు నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై కె.సురేష్‌బాబు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. ముమ్మిడివరం మండలం కర్రివానిరేవు పంచాయతీ పరిధి చింతావానిరేవుకు చెందిన మల్లాడి నాగజ్యోతి(19)కి రెండున్నరేళ్ల కిందట మధుకుమార్‌తో వివాహం జరిగింది. వారికి 18 నెలల కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తలిద్దరూ తరచూ తగవులు పడేవారు. భర్తను ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లవద్దని నాగజ్యోతి చెప్పింది. అయినప్పటికీ అతడు వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన నాగజ్యోతి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.